28న బార్ అసోసియేషన్లకు ఎన్నికలు

నాంపల్లి కోర్టులు, మార్చి 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని అన్ని బార్ అసోసియేషన్లకు ఈ నెల 28న ఎన్నికలు నిర్వహించాలని బార్ కౌన్సిల్ చైర్మెన్ నర్సింహారెడ్డి హైకోర్టు రిజిస్ట్రార్‌కు వినతిపత్రాన్ని అందించారు. రిజిస్ట్రార్ సూచనల మేరకు అన్ని కోర్టులకు చెందిన బార్ అసోసియేషన్ల ఎన్నికల్ని సజావుగా పూర్తి చేయాలని తెలంగాణ బార్‌కౌన్సిల్ తెలిపింది. ఎన్నికల సమయంలో హోర్డింగ్‌లు, బ్యానర్లు, పత్రికలు, సినిమాల్లో ప్రచారం కోసం ప్రకటనలివ్వరాదని, ప్రలోభాలకు గురిచే సే విధంగా పాల్పడకూడదని సూచించింది. 15న ఓటర్ల జాబితాను ప్రకటించాలని, 18నుంచి 20పరకు నామినేషన్ల గడువు చేపట్టాలని వివరించింది. ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు ఏప్రిల్1న బాధ్యతలు చేపట్టనున్నారు.

ఏడుపాయలకు స్పెషల్ బస్సులు

కాచిగూడ, మార్చి 5: మహాశివరాత్రిని పురస్కరించుకుని భక్తుల కోసం ఏడుపాయల జాతరకు కాచిగూడ డిపో ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు సీబీఎస్ నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు హైదరాబాద్ రీజినల్ మేనేజర్ వరప్రసాద్ తెలిపారు. సీబీఎస్ నుంచి ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు బయలుదేరుతుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

దయానంద్‌నగర్‌లో పర్యటిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

సైన్స్‌ఫెయిర్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్/కవాడిగూడ, మార్చి 5: అడిక్‌మెట్ దయానంద్‌నగర్ బస్తీలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించనున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. మంగళవారం ఆయన దయానంద్‌నగర్‌లో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు తమ బస్తీల్లో గత ఏడాది కాలంగా డ్రైనేజీ, తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే జలమండలి అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పురాతన పైపులైన్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, కె.సురేందర్, రామాలయం చైర్మన్ డి.రవియాదవ్, మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

విద్యార్థులు కష్టపడి చదువుకొని అన్ని రంగాలలో రాణించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కవాడిగూడ డివిజన్‌లోని కేమ్ బ్రిడ్జీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ రఘు, వైస్ ప్రెసిడెంట్ ఆరిఫ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, సయ్యద్ అహ్మద్ భక్తియార్, కిరణ్, శ్రీహరి, దుర్గస్వామి, ప్రవీణ్, రూప, మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాశాలలో నిర్వహించిన ఎన్‌సీసీ ఫేర్‌వెల్ వేడుకలలో పాల్గొన్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జే లక్ష్మణ్‌నాయక్, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ పల్లాటి నరేశ్ తదితరులు

ఎన్‌సీసీ ఫేర్‌వెల్ వేడుకలు

సుల్తాన్‌బజార్, మార్చి 5: పట్టుదలకు, క్రమశిక్షణకు మారు పేరు నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)అని సైఫాబాద్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జే లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మంగళవారం మాసాబ్‌ట్యాంక్‌లోని కళాశాలలో ఎన్‌సీసీ ఫేర్ వెల్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో మొదటిసారి ఎన్‌సీసీలో ఫేర్‌వెల్ వేడుకలను నిర్వహించడం పట్ల ఎన్‌సీసీ అధికారి నరేశ్‌ను అభినందించారు. ఈ సంధర్భంగా వేడుకలకు విచ్చేసిన 3 తెలంగాణ బెటాలియన్ అధికారులు గోపాల్, విజయ్‌కుమార్, కళాశాల కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్, తెలంగాణ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వై.జయప్రకాశ్‌లను సన్మానించారు. ఈ సంధర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, హాస్టల్ వార్డెన్ స్రవంతి, అధ్యాపకుడు సత్యం పాల్గొన్నారు.

వాటర్‌వర్క్స్ పనులను త్వరగా పూర్తి చేయాలి

నియోజకవర్గంలోని పలు బస్తీలు, కాలనీల్లో చేపట్టిన డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అధికారులకు చెప్పారు. వాటర్‌వర్క్స్ పనులపై మంగళవారం ఎమ్మెల్యే అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే మొదలు పెట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. అలాగే కొత్త వాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు భావన, మాజీద్, రోహిత్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

– అంబర్‌పేట, మార్చి 5

బ్రహ్మోత్సవాలకు రావాలని గవర్నర్‌కు ఆహ్వానం

జూబ్లీహిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌ను టీటీడీ అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మెట్టు రాఘవేంద్ర ఆహ్వాన పత్రికను అందజేశారు. ఇందుకు గవర్నర్ హాజరవుతానని అన్నట్లు వారు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి అనుగ్రహం పొందాలని కోరారు.

– అబిడ్స్, మార్చి 5

మానవ సేవతోనే మోక్షం

సుల్తాన్‌బజార్, మార్చి 5: మానవ సేవతోనే మోక్షమని భోధించిన గొప్ప మానవతావాది మహర్షి దయానంద సరస్వతి అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బీజే రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం కోఠిలోని సుల్తాన్‌బజార్ ఆర్య సమాజంలో మహర్షి దయానంద సరస్వతి పుట్టిన తిథి దయానంద దశమి పర్వాన్ని పుర స్కరించుకొని కార్యక్రమాలను నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల ఆర్య సమాజ్ ప్రతినిధి డాక్టర్ ధర్మతేజ, డీఎన్‌పీ పదవిని త్యాగం చేసిన నళిని, ఆచార్య సవిత పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ జిల్లా గ్రంథాలయం సంస్థ ఔట్‌సోర్సింగ్ సంఘం నాయకులు పీఆర్‌సీ కమిషన్ చైర్మన్ ఎన్.శివశంకర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, సుగ్రీవ మాట్లాడుతూ.. ఇందుకు పీఆర్‌సీ కమిషన్ చైర్మన్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేశ్ తదితరులు ఉన్నారు.

– చిక్కడపల్లి, మార్చి 5

కొనసాగుతున్న పోలియో చుక్కల పంపిణీ

పోలియో రహిత సమాజంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు కోఠి ఆర్ఎఫ్‌పీటీసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు చిన్నారులకు పోలియో చుక్కల కార్యక్రమాన్ని మంగళవారం యూపీహెచ్‌సీ పరిధిలో కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు.

– సుల్తాన్‌బజార్, మార్చి 5

నాంపల్లిలోని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం భవనంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ డివిజనల్ అకౌంట్స్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీ పి.గీత, వర్క్స్ అండ్ అకౌంట్స్ జాయింట్ డైరెక్టర్‌లు శైలజారాణి, రజని, టీజీవో మహిళా ప్రతినిధి దీపారెడ్డి, ఏపీ ఏవో సుమతిరేఖ, నీరజ, డీఏఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోయిను ద్దీన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆటల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

– సుల్తాన్‌బజార్, మార్చి 5

విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్‌లో ఉద్వాసనకు గురైన కార్మికులకు న్యాయం చేయాలని, నాంపల్లి లేబర్ కోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని మంగళవారం విద్యుత్ శాఖ కార్మికులు చంద్రవిహార్ ముందు ధర్నాకు దిగారు. వరంగల్ లేబర్ కోర్టులో 2006 నుంచి కేసు పెండింగ్‌లో ఉందని, చివరకు లేబర్ కోర్టు కేసును డిస్మిస్ చేయడంతో 55 మంది కార్మికులు వీధిన పడ్డారని, వారికి న్యాయం జరిగేలా చూడాలని కార్మిక నాయకులు వజీర్, చంద్రశేఖర్, జగదీశ్, కె.రత్నారావు, రామ్మోహన్‌రెడ్డి కోరారు.

– అబిడ్స్, మార్చి 5

వర్క్‌షాప్‌కు హాజరైన మహిళలు, శ్రీధర్ భూశెట్టి, సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్

వీడియోగ్రఫీలో మహిళలకు అవకాశాలు

చిక్కడపల్లి, మార్చి 5: ఫొటో, వీడియోగ్రఫీ రంగంలో మహిళలకు మంచి అవకాశాలు ఉన్నాయని తెలంగాణ ఫొటో అండ్ వీడియో సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. సంక్షేమ సంఘం, జయచంద్ర ఫొటోగ్రఫీ అధినేత స్టిల్ కెమెరామెన్ శ్రీధర్‌భూశెట్టి ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహిళకు ఉచిత ఫొటోగ్రఫీ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. వర్క్‌షాప్‌లో మహిళలకు ఫొటోగ్రఫీకి సంబంధించిన కెమెరా మెలకువలను, నూతన టెక్నాలజీ, బిజినెస్ స్కిల్స్‌ను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కె.హుస్సేన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి శైలేందర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి లక్ష్మారెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఎల్. జయమాధురి, కార్యదర్శి తులసి, కోశాధికారి విలయక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు.

ఆహారం తినలేమంటూ విద్యార్థుల రోడ్డు బాట

నిజాం కళాశాల హాస్టల్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

సుల్తాన్‌బజార్, మార్చి 5: నిజాం కళాశాల హాస్టల్ మెస్‌లో కంట్రోల్ బియ్యం, నూకలతో వండుతున్నారని, నాసి రకం కూరగాయలతో కూర చేస్తున్నారని విద్యార్థులు రోడ్డు బాట పట్టారు. ఈ మేరకు మంగళవారం ఈ హాస్టల్ మెస్‌లో భోజనం చేయలేమని సుమారు 300 మంది విద్యార్థులు వండిన అన్నం, కూరలతో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించడంతో తీవ్ర ట్రాఫిక్ జాం ఏర్పడింది. విద్యార్థులు మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా హాస్టల్ మెస్‌లో కంట్రోల్ బియ్యం, నూకలతో ఆహారాన్ని తయారు చేస్తున్నా రని విద్యార్థులు మండిపడ్డారు. ఉడకని అన్నం పెడుతున్నారని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. రోడ్డుపై బైఠాయించడంతో తీవ్ర ట్రాఫిక్ జాంఅయి వాహనదారులకు ఇక్కట్లు కలుగుతుండటంతో అక్కడికి చేరుకున్న పోలీసులు విద్యార్థులను సముదాయించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయం తెలుసుకున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా నాయక్ అక్కడికి చేరుకొని విద్యార్థులకు సన్న బియ్యం తెప్పిస్తానని హామీనివ్వడంతో విద్యార్థులు శాంతించారు.

మహిళా సాధికరతపై సదస్సు

ముషీరాబాద్, మార్చి 5: విద్యానగర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళా సాధికారత అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో కొచ్చిఫిన్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధి, బ్యాంకింగ్ రంగ నిపుణుడు ఆర్. శ్రీకృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొని 'ఫైనాన్షియల్ వెల్నెస్ ఆఫ్ ఉమెన్' అనే అంశంపై ప్రసంగించారు. భారత్‌లో ద్రవ్యోల్బణం పెరుగుదల, రూపాయి విలువ తగ్గుదలతో వచ్చే లాభ నష్టాలు, డిపాజిట్లు, సేవింగ్స్ వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సుకన్య, అధ్యాపకులు భారతి, వెంకటఈశ్వర్, నవీనా రాణి, అనిత, నిర్మల, నాగమణి, సుచిత్రా సింగ్, రవిప్రసాద్, కల్యాణి పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

చిక్కడపల్లి, మార్చి 5 : లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైస్, వీవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్ డివిజన్ లోని వీవీ గిరి నగర్ బస్తీ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం డివిజన్ కార్పొరేటర్ పావని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి శిక్షణ కేంద్రాలు ఎంతో దోహద పడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, తర్నసాయిచంద్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ హరీశ్‌రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు మధు, ప్రాజెక్ట్ చైర్మన్ గణేశ్ పాల్గొన్నారు.

అబిడ్స్ సీఐగా రాజగోపాల్‌రెడ్డి

అబిడ్స్, మార్చి 5: అబిడ్స్ ఇన్‌స్పెక్టర్‌గా జి.రాజగోపాల్‌రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన నరసింహరాజు బదిలీ కావడంతో ఆయన స్థానంలో జి. రాజగోపాల్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ఎస్ఐలు, సిబ్బంది నూతన ఇన్‌స్పెక్టర్‌కు అభినందనలు తెలిపారు.

బేగంబజార్ ఇన్‌స్పెక్టర్‌గా విజయ్‌కుమార్

సుల్తాన్‌బజార్, మార్చి 5: బేగంబజార్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా జి. విజయ్‌కుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఇక్కడ విధులు నిర్వహిస్తున్న నమిండ్ల శంకర్ ఎన్నికల నేపథ్యంలో బదిలీ కావడంతో జి.విజయ్‌కుమార్‌ను ఆయన స్థానంలో నియమించారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

అంబర్‌పేట, మార్చి 5: నేడు బతుకమ్మకుంటలోని ట్రాన్స్‌కో ఏడీఈ కార్యాలయం వద్ద విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు ఏడీఈ సీనయ్య తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినియోగదారుల నుంచి సమస్యలను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. సీజీఆర్ఎం చైర్‌పర్సన్, మెంబర్ టెక్నికల్, మెంబర్ ఫైనాన్స్, మెంబర్ కన్స్యూమర్ ఎఫైర్స్ తదితరులు హాజరవుతారని చెప్పారు. వినియోగదారులు వారి సమస్యలతో పాటు బిల్లుల్లో హెచ్చుతగ్గు పైన కూడా ఫిర్యాదు చేసి తగిన పరిష్కారం పొందవచ్చని వెల్లడించారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఈ సీనయ్య కోరారు.

మహిళ దృశ్యం



కార్వాన్, మార్చి 5: మహిళ అదృశ్యమైన ఘటన లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. లంగర్ హౌస్ పోలీసుల కథనం ప్రకారం.. లంగర్‌హౌస్‌కు చెందిన డమ్ము జలంధన్, విజయలక్ష్మి భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు. కాగా ఈ నెల 2న విజయలక్ష్మి (34) ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికలది ఆత్మహత్య కాదు.. ప్రభుత్వ హత్యే

- న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు ధర్నాకు యత్నం
- అనుమతి లేదని అడ్డుకున్న పోలీసులు
- న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటాం: ప్రజా సంఘాల నేతలు

రోడ్డుపై ధర్నా చేయడానికి వచ్చిన బాధిత కుటుంబాలను అనుమతి లేదని అడ్డుకున్న పోలీసులు

కవాడిగూడ, మార్చి 5: భువనగిరి హాస్టల్‌లో ఇటీవల ఇద్దరు బాలికల ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జిచే న్యాయవిచారణ జరిపించాలని భవ్య, వైష్ణవి న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో ఇందిరాపార్కులోని పార్కింగ్ స్థలంలో బాధిత కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు బైఠాయించారు. ధర్నాచౌక్ వద్ద ధర్నా చేపట్టడానికి వారు ప్రయత్నించగా అనుమతి లేదంటూ దోమలగూడ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో న్యాయపోరాట కమిటీ నాయకులు, బాధితుల కుటుంబ సభ్యులు ఖచ్చితంగా ధర్నా చేసి తీరుతామని, తమ పిల్లల ఆత్మహత్యలు కావని, ఇవి ముమ్మాటికి రాజకీయ హత్యలేనని అన్నారు. తమకు న్యాయం జరిగేంత వరకు ఇక్కడ నుంచి కదిలేది లేదని రోడ్డుపై పడుకొని నిరసన తెలిపారు. దోమలగూడ మహిళా పోలీసులు ప్రజావాణిలో ఫిర్యాదు చేసుకోవాలని వారికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు. పీఓ డబ్ల్యూ నేతలు సంధ్య, ఝాన్సీ, చైతన్య మహిళా సంఘం నాయకులు పి. జ్యోతి, వివిధ సంఘాల మహిళలు ధర్నాకు వచ్చి బాధితులకు మద్దతు తెలిపారు. భవ్య, వైష్ణవిల ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు బాధితుల కుటుంబ సభ్యులకు తాము అండగా ఉంటామని పేర్కొన్నారు.

భువనగిరి హాస్టల్ విద్యార్థులు భవ్య, వైష్ణవి మరణాలపై సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ చేయించాలని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు వాసు కే యాదవ్, కులనిర్మూలన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అభినవన్ భూరం, బీసీ మహిళా రాజ్యాధికార సంఘం అధ్యక్షురాలు రోజ్ నేత, ధనక్క, దరం మధు, సురేశ్, పిడికిలి రాజు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతుందని చెప్పుకుంటున్న ప్రభుత్వం పర్మిషన్ కోసం దరఖాస్తు చేసినా ధర్నాకు అనుమతించకపోవడం అత్యంత దుర్మార్గమని అన్నారు. కొందరు ప్రభుత్వ పెద్దల హస్తం ఉండడం వల్లనే పోలీసులు కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భవ్య, వైష్ణవిల మరణాలకు కారణమైన వార్డెన్ శైలజ, ఆటోడ్రైవర్ ఆంజనేయులును అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు.

ధర్నాను విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే

ముషీరాబాద్, మార్చి 5: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఎల్ఆర్ఎస్ ఫీజు రద్దు చేసి ఉచితంగా అమలు చేయాలని కోరుతూ నేడు(బుధవారం)బీఆర్ఎస్ నిర్వహించనున్న ధర్నాను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గోపాల్ ఒక ప్రకటనలో కోరారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహించతలపెట్టిన ధర్నాలో బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొని విజయం వంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

అబిడ్స్, మార్చి 5 : గోషామహల్ నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించేందుకు అధికారులను ఆదేశించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎం. ఆనంద్‌కుమార్ గౌడ్ మినిస్టర్ క్వార్టర్స్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. కోఠిలోని కామత్ హోటల్ పక్కన ఉన్న జీహెచ్ఎంసీకి చెందిన 13 దుకాణాలను కొన్ని రోజుల క్రితం అధికారులు తక్కువ అద్దెకు కట్టబెట్టారని, గౌలిగూడలో కూడా ఇదే తరహా లో ఉందని వివరించగా, మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

విస్తరాకులకు నిప్పు

చిక్కడపల్లి, మార్చి 5: బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు ఫుట్‌పాత్‌పై ఇతర జిల్లాల నుంచి వచ్చిన కొందరు విస్తరాకులు (మోదుగు ఆకులు) విక్రయిస్తూ జీవన సాగిస్తున్నారు. ఫుట్‌పాత్‌పై పెట్టిన విస్తరాకులను సోమవారం రాత్రి కొందరు దుండగులు నిప్పు అంటించడంతో కాలి బూడిదయ్యాయి. బాధితులు యాదాద్రి భూవనగిరి జిల్లా లక్ష్మీతండాకు చెందిన ధీరావత్ కృష్ణ, ధీరావత్ లక్ష్మి నగరానికి వలస వచ్చారు. జీవనాధారం కోసం కొన్ని సంవత్సరాలుగా సుందరయ్య పార్కు ఫుట్‌పాత్‌పై విస్తరాకులు, పచ్చిపల్లీలు, మొరంగడ్డలు అమ్ముతూ కాలం వెళ్లదీస్తున్నారు.. వారి బంధువులు చనిపోవడంతో ఊరికి వెళ్లారు.దీంతో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పు అంటించినట్లు తెలిపారు. రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు పోలీసులకు ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని వేడుకున్నారు.

రసాభాసగా అంగన్‌వాడీ కేంద్ర ప్రారంభోత్సవం

- బ్యానర్‌లో సీఎం ఫోటో లేదని వాదనకు దిగిన కాంగ్రెస్ శ్రేణులు
- పూర్తిగా మజ్లిస్ పార్టీ కార్యక్రమంగా కొనసాగిందని ఆవేదన

చాంద్రాయణగుట్ట, మార్చి 5: పాతబస్తీలో రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్న కార్యక్రమం రసాభాసగా మారింది. ప్రసగం చేయమని పార్టీ శ్రేణులు కోరినప్పటికీ సమయం లేదని మంత్రి వెళ్లిపోయారు. ఉప్పుగూడ అరుంధతి కాలనీ 175 గజాల ప్రభుత్వ స్థలంలో మున్సిపల్ శాఖ మంజూరు చేసిన రూ.7.50 లక్షలతోపాటు దాతలు అందించిన రూ.7.50 లక్షలతో అంగన్‌వాడి కేంద్రాన్ని నిర్మించారు. మంగళవారం కేంద్రాన్ని ప్రారంభించడానికి మంత్రి పొన్న ప్రభాకర్ వస్తున్నట్లు చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బోయ నాగేశ్ బ్యానర్లు ఏర్పాటు చేశారు. మంత్రి పాల్గొనే కార్యక్రమం పార్టీ నాయకులు, కార్యకర్తలకు తెలియకుండా ఎలా నిర్వహిస్తారంటూ నిలదీశారు. బ్యానర్‌లో కనీసం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పొటోలు వేయలేదని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల కాంగ్రెస్ నాయకులు పి.రాజు యాదవ్, మ్యాడం మోహన్ అధికారులను నిలదీశారు. మరో కాంగ్రెస్ నాయకుడు ప్రమోద్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పరంగా నిర్వహించే కార్యక్రమంలో స్వంత పార్టీ వాళ్లకు అవకాశం లేకుండా పూర్తిగా మజ్లిస్ పార్టీ కార్యక్రమంగా కొనసాగిందపి అన్నారు.

బీజేపీ జాయింట్ కన్వీనర్‌గా ఏడెల్లి అజయ్‌కుమార్

అజయ్‌కుమార్

అంబర్‌పేట, మార్చి 5: సికింద్రాబాద్ పార్లమెంటు బీజేపీ జాయింట్ కన్వీనర్‌గా బాగ్‌అంబర్‌పేట డివిజన్‌కు చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఏడెల్లి అజయ్‌కుమార్ నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆయనను నియమించారు. ఆర్ఎస్ఎస్ సంఘంలో చురుకైన స్వయం సేవక్‌గా గుర్తింపు పొందిన అజయ్‌కుమార్ గతంలో అంబర్‌పేట డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడిగా, బాగ్ అంబర్‌పేట డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా, డివిజన్ అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పని చేశారు. అంబర్‌పేట నియోజకవర్గం జాయింట్ కన్వీనర్‌గా, కన్వీనర్‌గా, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తించారు.

లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్‌గా కె.రఘుకుమార్

కార్వాన్, మార్చి 5: లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్